క్లుప్తంగా...

మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి



నాగారంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ..

కీసర: మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాల్సిన అవసరం ఉందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ హైదరాబాద్ రీజియన్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ఎం అలీ అన్నారు. గురువారం కల్వరి గ్రేస్ చర్చిలో వై.గాబ్రియల్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత మహిళలకు కావాల్సిన పరికరాలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ సుధీర్‌కుమార్, నాగారం 15వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు అభినందనలు



మంత్రి సత్యవతి రాథోడ్‌ను సన్మానిస్తున్న వైస్ చైర్మన్ రెడ్యానాయక్

పోచారం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను వెల్లడించిన సందర్భంగా మంత్రులు చామకూర మల్లారెడ్డి, సత్యవతి రాథోడ్‌ను ఆల్ ఇండియా బంజారా సంఘం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో ప్రచారం చేసి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, బంజారా సంఘ ప్రతినిధులు సుమన్ నాయక్, సుభాష్ నాయక్, సోమ్లా నాయక్, శంకర్, కాశీరామ్, శక్రు నాయక్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, అరుణ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని గుంటిగూడెకు చెందిన రాఘవేందర్‌రావుకు మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు అరుణతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కు గురువారం అందజేశారు. అనారోగ్యంతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆయనకు రూ.52,500లు మంజూరయ్యాయి. చెక్కును వారు అందజేశారు. విజయ్‌గౌడ్, నవీన్ ఉన్నారు.

ఓటుపై అవగాహన



కీసర: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సెర్ప్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సంఘం అధ్యక్షులు, గ్రామ సంఘం సహాయకులకు ఓటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సంతోష్, యాదయ్య, హరినాథ్, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, ఎస్‌టీపీ ప్లాంట్ పనులను, శాంతినగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం మేయర్ కావ్య, కమిషనర్ రామలింగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

100% ఉత్తీర్ణతే 'లక్ష్య'ం

- పదిలో వంద శాతం ఉత్తీర్ణత కోసం 'లక్ష్య' కార్యక్రమం
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో విద్యాశాఖ కసరత్తు
- కార్యక్రమం అమలుకు ప్రధానోపాధ్యాయులకు..
- 16లోగా సబ్జెక్టు ఉపాధ్యాయులకూ 15 రోజుల శిక్షణ



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రాథమిక పాఠశాలలకు తొలిమెట్టు.. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు 'ఉన్నతి' పేరుతో అమలు చేస్తున్న కార్యక్రమాల మాదిరిగానే.. పదో తరగతి విద్యార్థులకు 'లక్ష్య' అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయ్యింది.

బోధనలోని లోపాలు తెలుసుకునేలా..

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించేందుకు 'లక్ష్య' పేరుతో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి 23 వరకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే, ఆ తర్వాత ఉపాధ్యాయులకు సెప్టెంబరు 16 వరకు సబ్జెక్టుల వారిగా 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ తీసుకున్న ఆర్పీల సాయంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు 'లక్ష్య' కార్యక్రమాలపై వివరిస్తారు. ఉపాధ్యాయుల బోధనలోని లోపాలను తెలుసుకొని, విద్యార్థులకు అర్థమయ్యేలా ఎలా బోధించాలనే దానిపై దృష్టి సారిస్తారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు బోధన ఉపయోగపడేలా అవగాహన కల్పిస్తారు.

పాఠ్యాంశాల వారీగా పరీక్షలు..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సబ్జెక్టుల వారీగా బోధనకు పీరియడ్లు కేటాయిస్తారు. తర్వాత లఘు ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు 10 నుంచి పదిహేనుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. 50 శాతం సిలబస్ పూర్తయిన తరువాత అక్టోబరులో సమ్మేటివ్ అసెస్మెంట్–1, మొత్తం సిలబస్ పూర్తయిన తరువాత ప్రీఫైనల్, వార్షిక పరీక్షలు జరుగుతాయి. ప్రణాళిక కోసం ఉపాధ్యాయులకు కరదీపికలు ఇస్తారు. టీ–శాట్ చానెల్లోనూ సబ్జెక్టుల వారీగా విద్యార్థులు పాఠాలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తారు.

ప్రత్యేక తనిఖీలు...

ప్రభుత్వ పాఠశాల్లో 'లక్ష్య' కార్యక్రమం పడక్బందీగా అమలు చేసేలా పరిశీలనకు మండల స్థాయిలో ఎంఈవోలు, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి, సెక్టోరియల్ అధికారులకు బాధ్యతలను అప్పగిస్తారు. ఈ బృందం ప్రతి రోజు ఐదు పాఠశాలలను తనిఖీ చేసి చేసి నివేదికలు తయారు చేయాల్సి ఉంటుంది. జనవరి నుంచి రాష్ట్రస్థాయి బృందాలు కూడా పాఠశాలలను తనిఖీ చేస్తాయి. విద్యార్థులు చదువులో వెనుకబడితే సంబంధిత ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సింటుంది.

గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఇలా..

జిల్లా పేరు	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1,301	1,65,203
మొత్తం	2,497	3,64,139

ఉత్తమ ఫలితాలే 'లక్ష్య'ంగా..

విద్యార్థులు చదువుకున్నది అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో 'లక్ష్య' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల స్థాయిలో చదివింది ఇంటర్మీడియట్లోనూ ఉపయోగపడేలా చూస్తాం. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తాం. విద్యార్థులకు కరదీపికలు అందజేస్తాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపయోగపడుతుంది.

– ఐ.విజయకుమారి, విద్యాశాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

సకాలంలో వేతనాలు చెల్లించడం లేదంటూ నిరసన



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్‌యార్డు రాంకీ సంస్థ సకాలంలో వేతనాలు చెల్లించడం లేదంటూ గురువారం డంపింగ్ యార్డు ప్రధాన గేటు వద్ద కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డులో రాంకీ సంస్థ యాజమాన్యం కొద్ది రోజులుగా రెండు విడతలుగా వేస్తున్నారని, మరికొందరికి నెల రోజులుగా జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనివేళలు 8 గంటలు ఉండే సమయాన్ని 12 గంటలు చేయాలంటూ రోజుకో కొత్త నిబంధన పెడుతున్నారన్నారు. వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం

డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లోని సంతోష్‌నగర్ కాలనీవాసుల సొంత నిధులు, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహకారంతో గురువారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అభినందనీయమన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్, శ్రీమన్నారాయణ, మల్లారెడ్డి, చంద్రయ్య, భారతి, సుజాత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కీసర: అందరి సహకారంతో నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులోని సాయి మహిమ కాలనీలో సుమారు రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కో ఆప్షన్‌సభ్యుడు షఫి, కాలనీ అధ్యక్షుడు రాపోల్ ప్రవీణ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



నాగారం సాయిమహిమ కాలనీలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ

అవుషాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయంతో చంద్రుడి దక్షిణ ధృవంపై మొదట అడుగుమోపిన ఘనత భారతదేశానికి దక్కిందని అన్నారు. – ఘట్‌కేసర్



ఎస్‌ఓటీ ఎస్‌ఐపై దాడి

ముగ్గురు యువకులపై కేసు నమోదు

మేడ్చల్‌రూరల్: విధి నిర్వహణలో భాగంగా కారులో వెళ్తున్న ఎస్‌ఓటీ ఎస్‌ఐని దుర్భాషలాడటమేగాక దాడికి పాల్పడిన ముగ్గురు యువకులపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ ఎస్‌ఓటీ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కిశోర్ బుధవారం సాయంత్రం కారులో కొంపల్లి వైపు సర్వీస్‌రోడ్డులో వెళ్తుండగా అదే దారిలో నడుచుకుంటూ వెళ్తున్న అత్వెల్లికి చెందిన షేక్ ఇర్ఫాన్ అనే వ్యక్తి కిశోర్‌ను నెమ్మదిగా వెళ్లాలంటూ దుర్భాషలాడాడు. దీంతో కారు ఆపి కిందకు దిగిన ఎస్‌ఐ తాను నెమ్మదిగానే వెళుతున్నా ఎందుకు బూతులు తిడుతున్నావని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇర్ఫాన్ తన మిత్రులు జావెద్, జువేర్‌లకు ఫోన్ చేయడంతో అక్కడికి వచ్చిన వారు కిశోర్‌ను దుర్భాషలాడారు. దీంతో తాను ఎస్‌ఓటీ ఎస్‌ఐనని చెప్పడంతో 'నువ్వు ఎస్‌ఐ అయితే మా కేంటంటూ' అతని ఫోన్, ఐడీ కార్డు లాక్కుని దాడి చేశారు. దీనిని గుర్తించిన స్థానికులు అక్కడికి చేరుకోవడంతో ఇర్ఫాన్ అతడి మిత్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు కిశోర్ ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లీ పిల్లలు అదృశ్యం

మేడ్చల్‌రూరల్: భర్తతో గొడవపడి భార్య పిల్లలతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా కామారెడ్డికి చెందిన గుగ్లోత్ ఉమేశ్ భార్య ప్రియాంక, పిల్లలతో కలిసి కొంత కాలంగా మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న మధ్యాహ్నం సమయంలో భార్య ప్రియాంక భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి పిల్లలు హన్సిక(2), హర్ష(1) వెంట పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతకీ తిరిగి రాకపోవడం, బంధువుల ఇళ్లలో ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం భర్త ఉమేశ్ మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్– బీబీనగర్ రైల్వేస్టేషన్ మధ్య 215 మైలురాయి వద్ద బుధవారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు బోడుప్పల్‌కు చెందిన పోలోజు వెంకటాచారిగా(70) గుర్తించారు. మరణానికి గల కారణాలు తెలియరాలేదు. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'శ్రీనిధి' అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా యూనివర్సిటీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీనిధి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ అనుమతి లేకపోయినా యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు ఇవ్వడంతో మొదటి సంవత్సరం నష్టపోయిన విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీనిధి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

11 మందికి కారుణ్య నియామక పత్రాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉద్యోగ నిర్వహణలో తమ విధులను సక్రమంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కారుణ్య నియామకాల కింద 11 మందికి నియామక పత్రాలను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో పని చేస్తూ మరణించిన వారి వారసులకు విద్యార్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగంలో నియామకాలు ఉంటాయన్నారు. కారుణ్య నియామకాల కింద జిల్లాలో మొదటి విడతలో 28 మందికి నియామక పత్రాలు అందజేయగా, ప్రస్తుతం 11 మందికి కారుణ్య నియామకాల కింద నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ, రామ్మోహన్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి చెందిందని, ఓర్వలేక కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వార్డులు, కాలనీల్లో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను సొంత నిధులతో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ రాజేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



16వ వార్డులో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఎన్‌ఎస్‌డీసీతో కిష్టాపూర్ మల్లారెడ్డి కళాశాల ఎంఓయూ



మేడ్చల్: విద్యార్థుల్లో మరింత స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వివిధ కోర్సుల్లో విద్యార్థులను నిష్టాతులుగా చేసేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సౌజన్యంతో ఏడేళ్ల పాటు నిర్వహించే శిక్షణ కోర్సుల కోసం ఎంఓయూ చేసుకున్నట్లు పట్టణంలోని కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి తెలిపారు. కళాశాలలో ఎన్ఎస్‌డీసీ, ఎతనోటెక్, ఐఎస్‌టీఈ ప్రతినిధులతో కలిసి కళాశాలలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఎన్ఎస్‌డీసీ సంస్థ తెలంగాణలో తొలిసారిగా కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో ప్రాజెక్ట్ చేపట్టిందని ప్రాజెక్ట్‌ను ఎతనోటెక్ సంస్థ నిర్వహిస్తోందని అన్నారు. తాము కోర్సులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఎనిమిది రకాల సాంకేతిక కోర్సులతో పాటు వివిధ రకాల కోర్సులకు ప్రాజెక్ట్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని, ఈ కోర్సుల వల్ల విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరి కృష్ణారెడ్డి, బీఓజీ చైర్మన్ టీకెకె రెడ్డి, ఐఎస్‌టీఈ అధ్యక్షుడు ప్రతాప్ సిన్హాకాకా సాహెబ్ దేశాయ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఎన్ఎస్‌డీఈ సీనియర్ అనాలిసిస్ట్ సాహెల్ గోయల్, ఎతనోటెక్ సీఈఓ కిరణ్‌రాజన్న, సలహాదారు సత్యనారాయణ, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, కైరోస్ స్కూల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు రాఘవేందర్ రెడ్డి, భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

పేదల కోసం అనేక పథకాలు

కీసర: సీఎం కేసీఆర్ పేద సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్న గొప్పనాయకుడని దమ్మాయిగూడ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ నాగాయపల్లి సుజాతశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకేకాలనీలో నివాసం ఉంటున్న దివ్యాంగులకు ఇటీవల సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచగా పింఛన్ డబ్బులను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ముమ్మందు కూడా అనేక సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత నాగయపల్లి శ్రీనివాస్, మొయినుద్దీన్, వెంకటేష్, బాలయ్య, టార్జన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జీకే కాలనీలో దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేస్తూ..

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ ఎలక్ట్రీషియన్ బాల్‌రెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం తరఫున రూ.10 వేలు, చైర్ పర్సన్ సొంత డబ్బులు రూ.5 వేలను అందజేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి రావాల్సిన డబ్బులు, ఈఎస్ఐ, పీఎఫ్ త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, జంగయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, బాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, డైరెక్టర్ లక్ష్మారెడ్డి

బీజేపీ అధికారం కోసం శ్రమించాలి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే మెఘన సకోరే బోడెకర్

మేడ్చల్: రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని బీజేపీ మహారాష్ట్ర జింతురూ ఎమ్మెల్యే మేఘన సకోరే బోడెకర్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకూ ప్రచారం చేసి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని కోరారు. శక్తి కేంద్రాలు, బూత్ కన్వీనర్లతో ఆమె సమావేశం నిర్వహించి పార్టీ పురోగతిపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

బర్సిగూడలో పర్యటించిన తహసీల్దార్

కీసర: మండలంలోని బర్సిగూడ గ్రామంలో గురువారం కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ పర్యటించారు. గ్రామంలోని రైతులతో గ్రామ నక్షతో పాటు రెవెన్యూ సర్వే, కొత్తపట్టాదారు పాసుపుస్తకాల మంజూరుపై చర్చించారు. వీలైనంత త్వరలో గ్రామనక్షతో పాటు రైతులకు తెలంగాణ రాష్ట్ర కొత్త పట్టాదారు పాసుబుక్స్ అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు పడమటి నర్సింహారెడ్డి, డబ్బి నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బర్సిగూడలో పర్యటిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్